ప్రజాశక్తి
www.prajasakti.com
I

రూ.30 వేల కోట్లతో
హైదరాబాద్ ప్రగతికి ప్రణాళిక

- రూ.7,032 కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ
- కొనసాగుతున్న టెండరు ప్రక్రియ
- మే నెలలో పెద్ద ఎత్తున పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ (జిహెచ్ఎంసి), హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథార్టీ (హెచ్ఎండిఎ) పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర పనులు త్వరలోనే పెద్ద ఎత్తున ప్రారంభం కానున్నాయి. రూ.30 వేల కోట్లకుపైగా విలువ చేసే పనులు టెండరు ఆమోదం, టెండరు ప్రక్రియ చేపట్టే దశలలో ఉన్నాయి. ఒప్పందాలు పూర్తి చేసుకొని మే నెలలో ఈ పనులన్నీ ప్రారంభించడానికి పురపాలక శాఖ సన్నాహాలు చేస్తోంది. గోదావరి నుంచి 20 టిఎంసిల నీటి మళ్లింపు సహా ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లు, ఫ్లైఓవర్లు ఇలా అనేక పనులను చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం గత ఏడాది, ఈ ఏడాది ప్రారంభంలో పరిపాలనా అనుమతులు ఇచ్చింది. పనులను ప్యాకేజీల వారీగా విభజించింది. అంచనాల తయారీ, టెండర్లు పిలవడం ప్రారంభమైంది. కొన్ని టెండరు దశ దాటి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. మరికొన్ని టెండరు ప్రక్రియ దశలో ఉన్నాయి.

గోదావరి నీటిని మళ్లించేలా

రాజధానిలో అవుటర్ రింగ్ రోడ్ వరకు తాగునీటిని సరఫరా చేయాల్సిన హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్... రానున్న సంవత్సరాల్లో ఇబ్బంది లేకుండా ఉండేందుకు మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని మళ్లించాలని నిర్ణయించి రూ.7,360 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి రూ.5,400 కోట్లతో టెండర్లు పిలిచింది. ప్రస్తుతం పరిశీలన జరుగుతోంది. పది రోజుల్లో సిఒటికి వెళ్తాయి. మే మొదటి వారం నుంచి పనులు ప్రారంభించాలన్నది లక్ష్యం. యాన్యుటీ మోడల్‌లో ఈ పనులను చేపడతారు. 40 శాతం మెట్రోవాటర్ బోర్డు భరిస్తే, మిగిలిన 60 శాతం గుత్తేదారులు రుణాల ద్వారా తీసుకొంటారు. 10.3 శాతం వడ్డీ. గతంలో కంటే 2.2 శాతం వడ్డీని తగ్గించినట్లు, నేషనల్ హైవే వారు చెల్లించే ఫార్ములానే ఇక్కడ వినియోగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పది సంవత్సరాల నిర్వహణ బాధ్యత కూడా నిర్మాణ సంస్థలదే.

అమృత్ పథకం కింద 39 ఎస్‌టిపిలు

అమృత్ పథకం కింద 39 ఎస్‌టిపిల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ చేపట్టారు. వీటి విలువ రూ.3,800 కోట్లు. ఇందులో కొన్నింటికి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది.

ఎలివేటెడ్ కారిడార్లకు రూ.5,106 కోట్లు

హెచ్ఎండిఎ ఆధ్వర్యంలో రూ.5,106 కోట్లతో రెండు ఎలివేటెడ్ కారిడార్ల పనులకు గత ఏడాది నవంబరులో పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్డు వరకు (జాతీయ రహదారి 44తో) రూ.1,487 కోట్లతో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పని ప్రస్తుతం టెండర్ దశలో ఉంది. ఈ పనిని ఇపిసి పద్ధతిలో చేపట్టనున్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఒఆర్ఆర్ వరకు (రాష్ట్ర రహదారి-01తో) రూ.3,619 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనికి టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ పనిని కూడా ఇపిసి పద్ధతిలో చేపట్టనున్నారు.

ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ...

జిహెచ్ఎంసి పరిధిలో రూ.7,032 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు-ముగ్ధ జంక్షన్, ఫిల్మ్‌నగర్ జంక్షన్, మహారాజ అగ్రసేన్ జంక్షన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద స్టీల్ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, కాజాగూడ జంక్షన్, ఐఐటి జంక్షన్ వద్ద మల్టీ లెవల్ ఫ్లైఓవర్లు, అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్ వరకు రోడ్ల విస్తరణ, ఇంకా పలు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు, ఫ్లైఓవర్లు, ఆర్వోబీలు ఉన్నాయి. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు కూడా పలు పనులు చేపట్టనున్నారు.

రావిర్యాల నుంచి ఆమనగల్లు వరకు..

రావిర్యాల నుంచి ఆమనగల్లు వరకు రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని రూ.4,500 కోట్లతో చేపట్టనున్నారు. గతంలో చేయని లింకు రోడ్లకు (మిస్సింగ్ లింక్ రోడ్లకు) మరో రూ.1,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పురపాలక శాఖ వర్గాలు తెలిపాయి. మూసీ పునరుజ్జీవ కార్యక్రమాన్ని ప్రతిషా'త్మకంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. డిపిఆర్ తయారీ జరుగుతోంది. మరో రెండుమూడు నెలల్లో కన్సల్టెన్సీ సంస్థ డిపిఆర్ అందజేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సంబంధిత అధికారులతో, కన్సల్టెన్సీ సంస్థతో తరచూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమై సమీక్షిస్తున్నారు. బడ్జెట్‌లో కూడా రూ.1,500 కోట్లు కేటాయించారు. మొత్తమ్మీద పురపాలక శాఖ ఆధ్వర్యంలో మే నెల నుంచి రూ.30వేల కోట్లకు పైగా పనులు ప్రారంభమవుతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

సన్న బియ్యం రుచి చూసిన సిఎం

- బోరం శ్రీనివాస్ ఇంట్లో రేవంత్, మంత్రులు భోజనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాముల వారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు బూర్గంపాడు మండలం సారపాకకు వెళ్లారు. అక్కడ నాయకపోడు గిరిజనుడు బోరం శ్రీనివాస్ ఇంట్లో సన్న బియ్యం అన్నం ఆరగించారు. స్థానిక తాళగుమ్మూరులోని రేషన్‌షాప్ ద్వారా పంపిణీ చేసిన సన్నబియ్యంతో చేసిన వంటకాలను రుచి చూశారు. లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. లబ్ధిదారు కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యురాలు తులశమ్మను ఆరా తీశారు. దొడ్డుబియ్యం పంపిణీ చేసినప్పుడు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదని తులసమ్మ చెప్పారు. ఇప్పుడు సన్నబియ్యం ఇస్తుండటంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని ఆమె సీఎంతో చెప్పారు. ఇతర పథకాల గురించి కూడా సీఎం లబ్ధిదారు కుటుంబాన్ని ఆరా తీశారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్ సబ్సిడీలు అందుతున్నాయా అని ప్రశ్నించారు. వీటితో పాటు ఉచిత బస్సు ప్రయాణం తమకు ఎంతగానో ఉపయోగపడుతోందని తులశమ్మ హర్షం వ్యక్తం చేశారు.

ప్రగతిలేని ఆయిల్ పామ్ కంపెనీలపై వేటు

- నాలుగు కంపెనీల ఒప్పందాల రద్దుకు ప్రభుత్వం నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆయిల్ పామ్ సాగు, దాని అనుబంధ పరిశ్రమల స్థాపన, ఉత్పత్తుల కొనుగోలుకు ఒప్పందాలు చేసుకొని అమలు చేయని కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నోటీసులు ఇచ్చినా తీరుమాని నాలుగు కంపెనీల ఒప్పందాల రద్దుకు వ్యవసాయ శాఖ దస్త్రాలను సిద్ధం చేసింది. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగును పెద్దఎత్తున చేపట్టేందుకు నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం అందులో ప్రయివేటు భాగస్వామ్యం కల్పించేందుకు నిర్ణయించి వాటిని ఆహ్వానించింది. 2020లో 14 కంపెనీలు ముందుకొచ్చి ఒప్పందాలు చేసుకున్నాయి. 2020-21 నుంచి వాటికి ప్రభుత్వం కార్యాచరణను నిర్దేశించింది. ఇందులో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన భూముల్లో రైతులను ఒప్పించి మొక్కలు నాటించడం, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం, పంట వచ్చిన తర్వాత కొనుగోలు చేయడం, ఆయిల్‌పామ్ శుద్ధి పరిశ్రమలను స్థాపించడం వంటి వాటిని ఈ కంపెనీలు అమలు చేయాలి. ఆయా కంపెనీల పరిధిలోని రైతులకు రాయితీలను ప్రభుత్వమే ఇస్తోంది.

2021-24 వరకు మొత్తం 4,29,130 ఎకరాల లక్ష్యానికిగాను కేవలం 1,56,892.96 ఎకరాల్లోనే ఆయిల్‌పామ్ మొక్కలు నాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సాగుపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. నిత్యం సమీక్షలు నిర్వహించి కంపెనీలను అప్రమత్తం చేశారు. అయినా 2024-25లో లక్ష ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశిస్తే 40,247 ఎకరాల మేరకే సాగైంది. గతంతో పోలిస్తే కొంత ప్రగతి కనిపించినా చాలా కంపెనీల తీరు మారలేదు. ఈ క్రమంలో ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.21 వేలు పెరిగి, రైతులు సాగుకు ముందుకొస్తున్నా విస్తీర?ం పెరగకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగేళ్ల పనితీరును పరిశీలించి ఒప్పందాల అమలులో నిర్లక్ష్యం చూపుతున్న కంపెనీలపై వేటు వేయాలని ఆయన ఆదేశించారు. మిగిలిన కంపెనీల ధోరణి మారకపోతే వాటినీ ఉపేక్షించరాదన్నారు. దీనికి అనుగుణంగా అధికారులు వరంగల్, ములుగు, హనుమకొండ, జగిత్యాల, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల బాధ్యతలను నిర్వహించే నాలుగు కంపెనీల ఒప్పందాల రద్దుకు దస్త్రాలు సిద్ధం చేశారు. వాటికి ఆమోదం లభించిన వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తారు. ఏవైనా కంపెనీలు స్వఛ్ఛందంగా ఒప్పందాలను వదులుకునేందుకు ముందుకొచ్చినా వాటికి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. రద్దయిన కంపెనీల బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్‌కు అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఖమ్మం, కొత్తగూడెం, గద్వాల, జనగామ, మహబూబాబాద్, నారాయణపేట, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో ఆయిల్‌ఫెడ్ ప్రగతిని సాధిస్తున్నందున దానికి అప్పగించాలని భావిస్తోంది.

ధనాన్ని సద్వినియోగం చేస్తే జీవితం ధన్యం

- జస్టిస్ నాగ మారుతీ శర్మ

ప్రజాశక్తి - కల్చరల్

సంపాదించిన ధనాన్ని సద్వినియోగం చేస్తే వారి జీవితం ధన్యమని సిబిఐ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతీ శర్మ అన్నారు. ఫ్రిజ్‌లో రోజుల తరబడి మిగిలిన పదార్థాలు దాచుకుని తిని అనారోగ్యం పాలయ్యే బదులు పేదలకు పంచితే వారి దీవెనలు పుణ్య సంపద అని అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా లలిత కళా వేదికపై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో 'శ్రీ రామ నీ నామం ఎంతో రుచిరా' అనే శీర్షికన భక్తి గీతాల గానం జరిగింది. చింతలపాటి మూర్తి, లక్ష్మీ రమ, రాజ్య లక్ష్మి ఓరుగంటి, ఫణి, రమణిలు మధురమైన పాటలతో ప్రేక్షకులను పరవసులను చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ నాగ మారుతీ శర్మ మాట్లాడుతూ.. రాముడు ఆదర్శవంతునిగా యుగాలుగా నిలిచి ఉండటానికి కారణం ధర్మాన్ని ఆచరించడమేనని తెలిపారు. గాయకుడు మూర్తి మాట్లాడుతూ బెయిల్ కోసం లక్షలు ఇవ్వజూపిన తిరస్కరించిన వ్యక్తి నాగ మారుతీ శర్మ అనీ, అయన ధర్మాన్ని చెప్పడం కాదు.. పాటిస్తారని వివరించారు. అధ్యక్షత వహించిన కిన్నెర రఘురాం మాట్లాడుతూ నాగ మారుతీశర్మ లాంటి న్యాయ మూర్తిలు కొందరు ఉన్నా సమాజం పరిస్థితులు మారుతాయని తెలిపారు.

దేశ ప్రజలకు సన్న బియ్యం ఎందుకివ్వట్లేదు?

- టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్ బ్యూరో: తెలంగాణ రాష్ట్రానికి బిజెపియే సన్నబియ్యం సరఫరా ఇస్తుంటే, దేశ ప్రజలకు ఎందుకు ఇవ్వడం లేదని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. రోజురోజుకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు అభద్రతాభావం పెరుగుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'సొంత పార్టీలో గుర్తింపు కోసం, రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బండి సంజయ్ ఆరాటపడుతున్నారు. ఆయనకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపించకపోవడం విడ్డూరం. సీఎం రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టు వల్లే బీసీ రిజర్వేషన్లు, ఎస్సీవర్గీకరణ బిల్లులకు ఆమోదం లభించింది. హెచ్‌సీయూ అంశం ఉన్నత న్యాయస్థానం పరిధిలో ఉంది. రాజకీయ అవసరాల కోసం బండి సంజయ్ హెచ్‌సీయూపై మాట్లాడటం సమంజసం కాదు' అని పేర్కొన్నారు.

సీతమ్మ సాగర్‌కు సాంకేతిక అనుమతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతుల విషయంలో కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి)లోని ప్రాజెక్టు అప్రైజల్ డైరెక్టరేట్ పచ్చజెండా ఊపింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన టెక్నికల్ అడ్వైజర్ కమిటీ (టిఎసి) సమావేశం ముందుకు ఈ పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) పరిశీలనకు వచ్చిన సమయంలో.. డిజైన్లు, ఇతర అంశాలపై సిడబ్ల్యూసితో పరిశీలన చేయించాలని కేంద్ర జలశక్తి శాఖ సూచించింది. దీంతో డిజైన్లు, 2డి అధ్యయనాలను కొత్తగూడెం సర్కిల్ ఇంజినీర్లు ఇటీవల అందజేశారు. ఆ అంశాలపై టెక్నికల్ అడ్వైజరీ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక టిఎసి సమావేశం ఆమోదం తెలపడమే మిగిలిఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో గోదావరి నదిపై 36.57 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మిస్తున్నారు. ఇక్కడి నుంచి 67 టిఎంసిల నీటిని సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు తరలించేందుకు నిర్మాణాలు చేపట్టారు. సీతమ్మసాగర్ బ్యారేజీ, సీతారామ ఎత్తిపోతల పథకం.. రెండింటినీ కలిపి 'సీతారామ ఎత్తిపోతలు- సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు'గా రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ రూపొందించి కేంద్ర జల సంఘానికి సమర్పించింది.

గోదావరిపై సీతమ్మసాగర్ ఎగువ ప్రాంతంలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మించగా.. డిజైన్ల లోపంతోనే ఈ బ్యారేజీకి నష్టం వాటిల్లినట్లు కేంద్ర జలశక్తి శాఖకు ఎన్డీఎస్ఏ నివేదించింది. ఈ క్రమంలో సీతమ్మసాగర్ డిజైన్లపై జలశక్తి శాఖ సందేహాలు వ్యక్తం చేసింది. దీంతో ఈ బ్యారేజీకి సంబంధించిన డిజైన్లు, డ్రాయింగ్స్‌తోపాటు భూకంపాల ప్రభావ అధ్యయనం తదితర సమాచారాన్ని ప్రాజెక్టు ఇంజినీర్లు సమర్పించారు. బ్యారేజీకి 100 నుంచి 25 శాతం వరకు వివిధ స్థాయిల వద్ద వచ్చే వరద, దిగువకు విడుదల చేసే ప్రవాహాలకు తగినట్లు చేసిన డిజైన్లను అందజేశారు. బ్యారేజీ గేట్లు తెరిచిన సమయంలో నీటి విడుదల, ప్రవాహ వేగం, నీరు దూకే ప్రాంతం, ఈ సందర్ఠంగా ఏర్పడే శక్తికి సంబంధించిన 2డీ భౌతిక నమూనా అధ్యయనాల వివరాలనూ ఇచ్చారు. ప్రధాన ఆనకట్ట, స్లూయిస్ రేడియల్ గేట్లకు సంబంధించిన సమాచారం కూడా అందజేశారు. వీటన్నింటిపైనా పరిశీలన జరిపిన అప్రైజల్ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు.

నృత్య, సంగీత రంగాలలో భారత్ ఆర్ట్స్ అకాడమి కృషి విశేషం

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి

ప్రజాశక్తి - కల్చరల్

గత పన్నెండు సంవత్సరాలుగా నృత్య సంగీత రంగాలలో భారత్ ఆర్ట్స్ అకాడమీ చేస్తున్న కృషి విశేషమని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. ఆయా రంగాలలో బాలలను, యువతను ప్రోత్సహిస్తూ, వారికి వేదిక కలిపిస్తూ, సాంస్కృతిక రంగంలో విశిష్టత పొందిందని అయన పేర్కొన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై భారత్ ఆర్ట్స్ అకాడమీ పన్నెండు సంవత్సరాల వార్షిక ఉత్సవంతోపాటు శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన కొలెటి దామోదర్ పాల్గొని బాల రాముని పురస్కారాలు సంగీత, నృత్య బాలలకు బహూకరించి మాట్లాడారు. బాలల్లో ప్రతిభను గుర్తించి వారిలోని కళా భావనను ప్రోత్సహిస్తున్న తల్లితండ్రులు, విద్య నేర్పుతున్న గురువులు సంస్కృతిని పరిరక్షించడంలో వారు తొలి వరుసలో ఉంటారని పేర్కొన్నారు. నాట్య గురువులు సుష్మ, సరిత, నిషిత, శివని, సౌమ్య, లావణ్య, భరణి, మైథిలి, సంగీత గురువులు గంగాధర్ భారతి తదితరులు శిష్య బృందం రెండు వందల మంది నృత్య సంగీత ప్రదర్శనతో రవీంద్ర భారతి వేదిక రామ నామ పాటలతో రంజిల్లింది. సంస్థ అధ్యక్షులు లలితారావు స్వాగతం పలికిన సభలో సీరియల్స్ దర్శకుడు నాగ బాల సురేష్ కుమార్, నటి శైలజ తదితరులు పాల్గొన్నారు. భారత్ వరల్డ్ రికార్డ్స్ అధినేత రమణారావు అధ్యక్షత వహించారు

గ్యాస్ వినియోగదారుల బదిలీపై హైకోర్టు స్టే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆయిల్ కంపెనీలు తీసుకొచ్చిన 'గ్యాస్ వినియోగదారుల బదిలీ, మార్కెట్ పునర్నిర్మాణం- వినియోగదారు బదిలీతో ప్రాంతాల వారీగా నిర్వహణ' విధానంపై హైకోర్టు మూడు వారాలపాటు స్టే విధించింది. ఆ విధానం కొనసాగింపునకు సంబంధించి ఏజెన్సీలు లేవనెత్తిన అభ్యంతరాలపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లకు ఆదేశాలు జారీచేస్తూ విచారణను 16కు వాయిదా వేసింది. ఫిబ్రవరి 21న ఆయిల్ కంపెనీలు తీసుకువచ్చిన వినియోగదారుల బదిలీ విధానాన్ని సవాలు చేస్తూ శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్‌తోపాటు 33 గ్యాస్ ఏజెన్సీలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ ఇటీవల విచారణ చేపట్టి పై ఆదేశాలు జారీచేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "ఏళ్ల తరబడి ఏజెన్సీలు రీఫిల్ సిలిండర్లను విక్రయిస్తున్నాయి. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి, సిబ్బంది నియామకాలు చేపట్టి వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. ఈ దశలో కొత్త విధానం తీసుకువస్తే వీరికి నష్టం వాటిల్లుతుంది. 2018లోనూ ఈ కంపెనీలు మార్కెట్ పునర్నిర్మాణం, వినియోగదారుల బదిలీ విధానాన్ని ప్రవేశపెట్టగా.. ఏజెన్సీల పిటిషన్ల నేపథ్యంలో.. ఆ విధానం ఏకపక్షం, అసమంజమని పలు హైకోర్టులు కొట్టివేశాయి. ఆయిల్ కంపెనీలు సుప్రీం కోర్టును ఆశ్రయించగా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ దశలో మళ్లీ వినియోగదారుల బదలాయింపు విధానాన్ని తీసుకువచ్చాయి" అని వివరించారు. గ్యాస్ కంపెనీల తరపున సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ పిటిషన్ వేసే అర్హత ఏజెన్సీలకు లేదన్నారు. ఈ విధానంతో కొత్త పంపిణీదారులకు గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నదే లక్ష్యమన్నారు. ఏజెన్సీలకు కంపెనీలతో సంబంధంలేదని చెప్పారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి.. గ్యాస్ కంపెనీలు తెచ్చిన కొత్త విధానంపై మూడు వారాలపాటు స్టే ఇస్తూ ఆదేశాలు జారీచేశారు.

కెడబ్ల్యుడిటి-2 ఎదుట సమర్ధంగా వాదనలు

- న్యాయవాదులకు సంపూర్ణ సహకారం
- మంత్రి ఉత్తమ్ ఆదేశం

సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కృష్ణా జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కష్ణా జలాల ట్రిబ్యునల్ -2 ఎదుట సమర్ధవంతంగా వాదనలు వినిపించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. కృష్ణా,గోదావరి జలాశయాలలో తెలంగాణకు కేటాయింపుల కోసం న్యాయస్థానాల్లో రాష్ట్రం తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాదుల బృందానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం రోజున నీటిపారుదల శాఖ కేంద్ర కార్యాలయం జలసౌధలో నీటిపారుదల శాఖాధికారులతో పాటు న్యాయవాదుల ప్రతినిధుల బృందంతో మంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల సలహాదారు ఆదిత్యాదాస్ నాథ్, ఇఎన్‌సిలు అనిల్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఇప్పటివరకు కృష్ణా ట్రిబ్యునల్-2 ఎదుట జరిగిన వాదనలను పూర్తిగా సమీక్షించడంతోపాటు ఏప్రిల్ 15, 16 తేదీల్లో ట్రిబ్యునల్‌లో లెవనెత్తాల్సిన అంశాలపై సమగ్రంగా చర్చించి ముందస్తు వ్యూహాన్ని రూపొందించారు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన అనంతరం కష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, న్యాయబద్ధంగా తెలంగాణకు రావాల్సిన నీటి కేటాయింపులు వంటి అంశాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పూర్తిస్థాయిలో అధికారులు, న్యాయవాదులు వివరించారు. అందుకు మంత్రి స్పందిస్తూ న్యాయబద్ధంగా తెలంగాణకు రావాల్సిన నీటి కేటాయింపులపై బలమైన వాదనలు వినిపించేందుకు మార్గనిర్దేశనం చేశారు. దశాబ్దాలుగా సాగునీటిపై ఆధారపడి సేద్యం చేస్తున్న రైతాంగం నీటి కొరతతో ఆత్మక్షోభకు గురయ్యారనీ, అటువంటి అన్యాయ పరిస్థితిని సరిదిద్దేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని గుర్తుచేశారు. అదే సమయంలో కృష్ణా ట్రిబ్యునల్ -2 ముందు వాదనలకు అవసరమైన సమగ్రమైన సమాచారాన్ని అందించడంతోపాటు ఢిల్లీలో ఉన్న బందంతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు సమచారాన్ని తమకు అందించాలని మంత్రి ఉత్తమ్ నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రానికి సంబంధించిన వరకు వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, అప్పీళ్లు, వాటి ప్రస్తుత స్థితి ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అంతర్‌రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి గట్టి ప్రయత్నాలను చేస్తున్నదని మంత్రి స్పష్టం చేశారు.

ఐఐడిఇఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి జిటి గోపాలరావు మృతి

- భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన సిఐటియు నేతలు
- సంతాపం ప్రకటించిన సిఐటియు, ఐలూ, ఉద్యోగ సంఘాల నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఐఐడిఇఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి జీటీ.గోపాలరావు(73) మరణించారు. ఆయన కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి హైదరాబాద్‌లో ఆదివారం చనిపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నాదర్‌గూల్‌లోని కుమారుడి ఇంటికి ఆయన మృతదేహాన్ని తరలించారు. సోమవారం ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు జరగనున్నాయి. నాలుగు దశాబ్దాల పాటు ఆయన రక్షణ రంగ ఉద్యోగుల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. రక్షణ రంగ ఉద్యోగుల సమస్యలతోపాటు కార్మికోద్యమంపై పాలక పార్టీల విధానాలకు వ్యతిరేకంగా తలపెట్టిన సమ్మెల్లో, ధర్నాల్లో ఆయన చురుగ్గా పాల్గొంటూ క్రియాశీలపాత్ర పోషించారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఆయన తుది శ్వాస వరకు నిబద్ధతతో పనిచేశారు. జీటీ గోపాలరావు భౌతికకాయాన్ని సీఐటీయూ సీనియర్ నాయకులు పి.రాజారావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు భూపాల్, జె.వెంకటేశ్, ఎస్వీ.రమ, ఎం.వెంకటేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి.సుధాకర్, ఎ.సునీత, సీహెచ్.రోజా, ఎం.శ్రావణ్‌కుమార్, టి.సత్తయ్య, ఎం.చంద్రమోహన్, ఏఐడీఈఎఫ్ నాయకులు శివలింగం, హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు జంగయ్య, బాలు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన మరణం సీఐటీయూకి తీరని లోటు అని తెలిపారు. సీఐటీయూకు ఆయన అందించిన సేవలను మననం చేసుకున్నారు.

జిటి గోపాలరావు మృతికి సిఐటియు సంతాపం

జి.టి.గోపాలరావు మృతికి సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగు దశాబ్దాల పాటు రక్షణరంగ ఉద్యోగుల హక్కుల కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం సిఐటియుకి తీరని లోటని పేర్కొన్నారు.

జీటీ గోపాలరావు మరణం ఉద్యోగులు, కార్మికుల ఉద్యమాలకు తీరని నష్టమని ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, పీటీ నాయకులు డీఎఎస్‌వి.ప్రసాద్, మిట్ స్టాఫ్ మాజీ కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. రెండు రోజుల క్రితమే ఆయన్ను ఆస్పత్రిలో పరామర్శించామని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి సామాజిక ఉద్యమాలకు కూడా తీరని నష్టమని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO: 217/2018

పసుపుల సావిత్రి .. వాది

వర్సస్

పసుపుల రామ లక్ష్మమ్మ మరియు ముగ్గురు .. ప్రతివాదులు

టు,

ప్రతివాదుల చిరునామా

4వ (ప్రతివాది) గజల్ల పెద్ద చెన్నకేశవులు తండ్రి చన్నయ్య, వయసు సుమారు 32 సంవత్సరాలు, హిందూ, పోలీస్, బోయరేవుల గ్రామం, వెలుగోడు పోస్టు మరియు మండలం, కర్నూల్ జిల్లా.

ప్రస్తుత నివాసం : భీముడు బ్యారక్ వ్యాసనగర్ ఏపీ. పోలీస్ అకాడమీ, పుప్పల్‌గూడ రంగారెడ్డి జిల్లా, తెలంగాణా రాష్ట్రం.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పైకోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 16వ తేదీ ఏప్రిల్ నెల 2025సం.లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించ బడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 06-04-2025

ఇట్లు
శ్రీ షేక్ యాసిన్‌బాషా,
వాది తరుపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9346513649

జంతువుల దాహం తీర్చేందుకు వన్య'పానీ'యం

- చెక్‌డ్యామ్‌లు, నీటికుంటలు, సాసర్ పిట్ల ఏర్పాటు
- సోలార్ విద్యుత్ బోరు మోటార్లతో నీరు
- రాష్ట్రంలో 27,402.98 చదరపు కి.మీ అటవీ విస్తీర్ణం
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 8 వేలకు పైగా వన్యప్రాణులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వేసవి దృష్ట్యా వన్యప్రాణుల దాహం తీర్చేలా అటవీశాఖ చర్యలు చేపడుతోంది. అడవిలో నీటి సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 8వేలకు పైగా ఉన్న అడవి జంతువులను నీటి కష్టాలకు దూరం చేసేందుకు సమాయత్తం అయింది. ఉమ్మడి జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి కాబట్టి ముందు జాగ్రత్త చర్యలకు పూనుకుంది. అడవిలో నీటికుంటలు, చెలిమలు, వాగులు ఎండిపోతాయి కాబట్టి బోర్లు వేయించింది. వాటికి సోలార్ విద్యుత్ ఆధారంగా నడిచే మోటార్లు బిగించింది. నీటి ఎద్దడి నెలకొనకుండా ఇప్పటికే సమగ్ర చర్యలు చేపట్టినట్టు ఖమ్మం జిల్లా అటవీశాఖ అధికారి విక్రమ్‌సింగ్ మాన్ తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లోనూ వేసవి నీటి ఎద్దడి నుంచి అడవీ జంతువులను రక్షించేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

27,402 చ.కి.మీ అటవీవిస్తీర్ణం

రాష్ట్ర వ్యాప్తంగా 27,402.98 చదరపు కి.మీ అటవీ విస్తీర్ణం ఉంది. దీనిలో 2 టైగర్ రిజర్వ్ (అమ్రాబాద్, కవ్వాల్) జోన్లు, 7 అభయారణ్యాలు, 3 జాతీయ పార్కులు ఉన్నాయి. వీటిలో పులులు, జింకలు, చిరుతలు, మనుబోతులు, తోడేళ్లు, ఎలుగుబంట్లు, నక్కలు, అడవిదున్నలు ఇలా వివిధ రకాల జంతువులు జీవిస్తున్నాయి. అడవి జంతువుల దాహం తీర్చేందుకు కొన్నిచోట్ల ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపడుతుండగా.. కొన్నిచోట్ల అరకొర వసతులు కల్పిస్తున్నారు. సాసర్‌పిట్లలో సరిగ్గా నీరు నింపట్లేదనే ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల నీటి సౌకర్యాల మరమ్మతులు కూడా చేపట్టట్లేదు. కాంట్రాక్టర్లకు వీటి మరమ్మతులు, నిర్మాణ బాధ్యతలు అప్పగించినా సరైన చర్యలు తీసుకోవటం లేదు. అయితే అనేక జిల్లాల్లో మాత్రం సరైన చర్యలు చేపడుతున్నారు.

దట్టమైన అడవుల నిలయం..

ఉమ్మడి ఖమ్మం జిల్లా దట్టమైన అడవులకు నిలయంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం, కిన్నెరసాని, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు 8 అటవీ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 680.02 చదరపు కిలోమీటర్ల దట్టమైన అడవులున్నాయి. 1764.15 చదరపు కి.మీ మేర మధ్యరకం అడవులు ఉన్నాయి. పచ్చికబయళ్ల వంటి బాహ్య అడవులు 1024.96 చ.కి.మీ మేర విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో అడవి గేదెలు 1,890, చుక్కల దుప్పులు 4,275, కొండగొర్రెలు 656, అడవి పిల్లులు 672, ఎలుగుబంట్లు 410, కణుజులు 506 వరకు ఉన్నాయి. వేసవికాలంలో నీటి సౌకర్యాలు కల్పించకపోతే ఇవి జననివాసాల్లోకి వెళ్తాయి. ఈక్రమంలో ప్రమాదాల బారిన పడి అడవి జంతువులు ప్రాణాలు కోల్పోతాయి. పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అటవీశాఖ అప్రమత్తమైంది.

నీటివెతలు తీర్చగా..

ఉమ్మడి జిల్లాలో అడవి జంతువుల నీటివెతలు తీర్చేందుకు ఫారెస్టు అధికారులు చెక్‌డ్యామ్‌లు, సాసర్ పిట్లు, నీటికుంటలు నిర్మిస్తున్నారు. వీటిలో మూడు రోజులకోసారి ట్యాంకర్లతో నీరు నింపుతున్నారు. వీటికి తోడుగా అనేక చోట్ల బోర్లు వేశారు. వీటికి సోలార్ ఆధారంగా నడిచే మోటార్లు బిగించారు. దీనికోసం కంపా, బయోసాట్ నిధులు వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 591 చెక్‌డ్యామ్‌లు, 861 సాసర్ పిట్లు, 402 పెద్దనీటి కుంటలు, 379 చిన్ననీటి కుంటలు, 100 వరకు సోలార్ పంపుసెట్ల ద్వారా వన్యప్రాణులకు తాగునీరందించేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. నీటికోసం వచ్చిన అడవి జంతువులకు ప్రాణహాని కలిగించకుండా బేస్‌క్యాంప్‌లను సైతం ఏర్పాటు చేస్తోంది. అటవీశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేపట్టేలా చర్యలు చేపట్టారు. వేటగాళ్ల నుంచి అటవీజంతువుల రక్షణకు ట్రాపింగ్ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు.

నిధుల కొరతతో కొన్ని జిల్లాల్లో లేని వసతులు..

నిధుల కొరతతో కొన్ని జిల్లాల్లో ఎలాంటి సాసర్ రింగ్‌లు నిర్మించలేదు. కొన్నిచోట్ల సాసర్‌పిట్లు ఉన్నా వాటిలో నీళ్లు నింపటం లేదు. మరమ్మతు చర్యలు కూడా చేపట్టడం లేదు. పలుమార్లు ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కాకపోవడంతో కొన్నిచోట్ల అటవీ జంతువులు దాహంతో అల్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల కంపా నిధులు విడుదల కావట్లేదు. ఎస్‌డీఎఫ్ నిధుల కోసం అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నారు. ఇప్పటికే ఎండల తీవ్రత పెరగటంతో కొన్ని జిల్లాల్లో దాహంతో వన్యప్రాణులు అలమటిస్తున్నాయి. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టని చోట అవి బయటకు వస్తున్నాయి. ఇలా జనారణ్యంలోకి వచ్చిన అడవి జంతువులకు హాని తలపెడుతున్న సంఘటనలు ఉన్నాయి. నాలుగైదేండ్ల క్రితం నీటి కోసం అడవి నుంచి బయటకు వచ్చిన సాంబర్ జింక కాళ్లను దుండగులు నరికారు.

ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

- మంత్రి దామోదర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీతారాముల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. సీతారాముల దీవెనలతో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆయన ప్రార్థించారు. రాముని జీవితం ఆదర్శప్రాయం, అనుసరణీయం అని మంత్రి వ్యాఖ్యానించారు. శ్రీరాముని జీవిత విశేషాల గురించి, తల్లిదండ్రులు తమ పిల్లలకు బోధించాలని సూచించారు. రాముడు చూపిన మార్గంలో ప్రజా సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.

వ్యక్తిగత పనులకు ప్రభుత్వ వాహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారులు ప్రభుత్వ విధులు నిర్వహించేందుకు ఆయా రాష్ట్ర కార్యాలయాల్లో వాహనాలను అందుబాటులో ఉంచుతుంది. వాహనాలు లేని సమయంలో అద్దెకు సమకూర్చడం పరిపాటి. అయితే తరచూ వివాదాలను ఎదుర్కొంటున్న ఒక అధికారి ఏకంగా రెండు ప్రభుత్వ వాహనాలు ఉన్నప్పటికీ మరో వాహనాన్ని అద్దెకు తీసుకుని వ్యక్తిగత పనులకు ఉపయోగించుకుంటున్నట్టు సమాచారం. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో ఆ అధికారిపై తరచూ వివాదాలు అలుముకుంటున్నాయి. ఉద్యోగుల్లో ఇదే రకమైన చర్చ కొనసాగుతూనే ఉంది. గత ఏడాది కాలంగా ప్రయివేటు వాహనాన్ని అద్దెకు తీసుకుని ప్రతి నెలా రూ.78 వేలను చెల్లిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. పైపెచ్చు కార్యాలయంలో ఒక గదిని ఉదయం ప్రభుత్వ కార్యాలయంగా ఉపయోగిస్తుంటే సాయంత్రానికి ట్యూషన్ రూంగా మార్చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ వాహనంలో కుటుంబ సభ్యుల వ్యక్తిగత పనుల కోసం తిప్పుతున్నట్టు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. హెచ్ఐవీ రోగుల కోసం వినియోగించాల్సిన నిధులను రకరకాల రూపాల్లో పక్కదారి పట్టించడం సరికాదని ఉద్యోగులు చెబుతున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆ నిధులను వారి సేవల కోసమే ఉపయోగించాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే వాహనాల దుర్వినియోగంతో పాటు అనేక అవకతవకలు బయటపడే అవకాశముందని చెబుతున్నారు. టీశాక్స్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వ్యక్తి దారుణ హత్య

- వికారాబాద్ జిల్లా దోమ మండలంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పొలం వద్ద నిద్రిస్తున్న వ్యక్తి దారుణ హత్యకు గురయిన ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలం ఖమ్మం నాచారం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నాచారం గ్రామానికి చెందిన బోయిని మొగులయ్య (58) శనివారం రాత్రి తన పొలం వద్ద నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని గొడ్డలితో నరికి అతి దారుణంగా హత్య చేశారు. ఆదివారం ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా.. మంచంపై మృతిచెంది ఉన్నారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిగి డిఎస్‌పి శ్రీనివాస్, సిఐ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ నాగేందర్ పరిశీలించారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అల్లుడుపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగేందర్ తెలిపారు.

సిపిఎం నాయకులు శ్రీకాంత్ గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం రాష్ట్ర కమిటీ, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్ (62) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. ఆ పార్టీ అఖిల భారత 24వ మహాసభల్లో పాల్గొనేందుకు ప్రతినిధిగా మధురై వెళ్లిన శ్రీకాంత్ శనివారం మధ్యాహ్నం అస్వస్థతకు గురయ్యారు. పార్టీ నాయకులు స్థానిక అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతుండగా ఆదివారం మధ్యాహ్నం ఆయనకు మరోసారి తీవ్ర గుండెపోటు వచ్చింది. పరిస్థితి విషమించి ఆయన మృతి చెందారు. శ్రీకాంత్ భౌతిక కాయాన్ని సోమవారం ఉదయం ఖమ్మం తీసుకురానున్నారు. సందర్శన కోసం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఉంచుతారు. శ్రీకాంత్‌కు భార్య నాగసులోచన, ముగ్గురు కుమారులు ఉన్నారు. శ్రీకాంత్ భౌతికకాయాన్ని అపోలో ఆస్పత్రిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఎం సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, ఎస్ వీరయ్య, చుక్క రాములు, మల్లు లక్ష్మి, పాలడుగు భాస్కర్, నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, మచ్చా వెంకటేశ్వర్లు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఎపి రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు చెరుపల్లి సీతారాములు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీలో, ప్రజాసంఘాల్లో చురుకైన పాత్ర పోషించి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మృతి పార్టీకి తీరని లోటని జాన్‌వెస్లీ అన్నారు.

ఎస్ఎఫ్ఐతో మొదలైన ప్రస్థానం..

ఖమ్మంలోని ఓ సాధారణ కార్మిక కుటుంబంలో జన్మించిన శ్రీకాంత్.. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ వైపు ఆకర్షితులయ్యారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 37 సంవత్సరాలుగా కార్మికోద్యమంలో పనిచేస్తున్నారు. అనేక ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. శ్రీకాంత్ సతీమణి యర్రా సుకన్య కూడా ఖమ్మం పట్టణ ఐద్వా నాయకురాలిగా ఉన్నారు. రెండు సార్లు కౌన్సిలర్‌గా ఎన్నికై భర్త బాటలో ప్రజా సేవలో భాగమయ్యారు.

ఉద్యమాల్లోనూ చురుకుగా..

14 ఏళ్ల వయసులోనే ఉద్యమాల్లోకి వచ్చిన శ్రీకాంత్ ఎంతో చురుకుగా ఉండేవారు. చంద్రబాబు ప్రభుత్వ కాలంలో అసంఘటితరంగ కార్మికులు 1300 మందిని సమీకరించి దీర్ఘకాలిక పోరాటం చేశారు. పీఎఫ్, ఇతర సౌకర్యాలు సాధించటం కోసం కృషి చేశారు. 2000లో జరిగిన విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 21 రోజులు జైలు జీవితం గడిపారు. ఖమ్మం గ్రెయిన్ తరలింపును వ్యతిరేకిస్తూ మార్కెట్ కార్మికులను ఏకం చేయడంతో పాటు వేతనాలు, ఇతర సమస్యలపై పోరాటాలు నిర్వహించి ఫలితాలు సాధించారు. పట్టణ పేదలకు వెంకటగిరి, కోటనారాయణపురం, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్లు సిపిఎం పోరాట ఫలితంగా వచ్చాయి. శ్రీకాంత్ మృతికి పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఆర్థిక లాభం కోసమే పర్యావరణంపై దాడి

- గచ్చిబౌలి భూములపై మా పోరాటం ముగియలేదు
- విద్యార్థుల పర్యావరణ ఉద్యమానికి మద్దతివ్వండి
- తెలంగాణ ప్రజలకు కెటిఆర్ బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణంపై దాడికి పూనుకుందనీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తేల్చిచెప్పారు. ఈ మేరకు ఆయన తెలంగాణ ప్రజలకు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. హెచ్‌సియు విద్యార్థులు 400 ఎకరాల కంచ గచ్చిబౌలి అడవిని కాపాడేందుకు చేపట్టిన ఆందోళనకు చివరిదాకా బిఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రభుత్వం తక్కువ చేసి చూపాలన్న కుట్రతో అనేక అపవాదులు వేస్తున్నా, నిస్వార్థమైన విద్యార్థి-ప్రజా పోరాటాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయని తన లేఖలో పేర్కొన్నారు. వందల రకాల జంతుజాలం, వృక్షజాతులతో ఉన్న ప్రాంతాన్ని కాపాడి, భవిష్యత్ తరాలకు అందించేందుకు వారు చేసిన పోరాటానికి దేశంలోని వివిధ రంగాల ప్రముఖులు కలిసి రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాదిరిగా ఆర్థిక ప్రయోజనాల కోసం ఆలోచించకుండా, భవిష్యత్ ప్రయోజనాల కోసం కంచ గచ్చిబౌలి భూముల వేలాన్ని విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ కోసం, బెదిరింపు ధోరణిలో ఏకో పార్క్ ఏర్పాటు అంటూ, ఫోర్త్ సిటీకి సెంట్రల్ యూనివర్సిటీ తరలింపు అంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మొదలుకొని ప్రతి కాంగ్రెస్ నాయకుడి వరకూ పక్కా కుట్రతో మాట్లాడుతున్న మాటలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. విద్యార్థుల పోరాటం ఫలించి ప్రభుత్వం చేసిన పర్యావరణ హత్యను సుప్రీంకోర్టు అడ్డుకున్నదనీ, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రల నేపథ్యంలో ఈ పోరాటం పూర్తిగా అయిపోలేదని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ కుట్రలను, బెదిరింపులను, దుష్ప్రచారాన్ని దాటుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. హెచ్‌సీయూ పర్యావరణం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మేధావులు, పర్యావరణ వేత్తలతో పాటు తెలంగాణ సమాజమంతా కలిసి రావాలని పిలుపు నిచ్చారు.

కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైంది : మంత్రి కిషన్‌రెడ్డి

- వాజ్‌పేయి, అద్వానీ కలలు మోడీతో సాకారం : ఎంపి డాక్టర్ లక్ష్మణ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పాలనలో పదేళ్లలో ప్రజల్లో వ్యతిరేకత మొదలైతే.. కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జెండాను కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి లేకుండా సమర్థవంతమైన పాలన అందించడమే తమ పార్టీ లక్ష్యమని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలోనూ, న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలోనూ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు విఫలమయ్యాయని చెప్పారు. బిజెపి ఎంపి, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ మాట్లాడుతూ.. వాజ్‌పేయి, అద్వానీ కలలను ప్రధాని మోడీ సాకారం చేస్తున్నారని చెప్పారు. ముస్లిములలోని పేదలకు న్యాయం చేయాలనీ, వక్ఫ్ ఆస్తుల ద్వారా మేలు జరగాలనే ఉద్దేశంతోనే తమ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, బంగారు శృతి, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్.. బుకీ అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న బుకీని పోలీసులు అరెస్టు చేసిన ఘటన హనుమకొండ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. హనుమకొండ ఎసిపి దేవేందర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న హైదరాబాద్‌కు చెందిన ఏజెంట్ చింతపండు కృష్ణ, హనుమకొండకు చెందిన ఆటగాళ్లు మెడిశెట్టి నరేష్, పులి ఓంకార్, పల్లపు సురేష్‌ను పదిరోజుల కిందట హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,58,000 విలువైన సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో కాకినాడకు చెందిన బుకీ గట్టం వీరమణికుమార్ అలియాస్ పండును ఆదివారం హన్మకొండ జిల్లా పద్మాక్షి కాలనీ వద్ద పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అరెస్ట్ చేశారు. 2023లో వీరమణికుమార్ గోవాకు వెళ్ళినప్పుడు హైదరాబాద్‌కు చెందిన యోగేష్ గుప్తా అలియాస్ జోగేష్ గుప్తా పరిచయం అయ్యాడు. అతను ఆన్‌లైన్ గేమ్ క్రికెట్ బెట్టింగ్ యాప్ అయిన రాధే ఎక్స్చేంజీ యాప్ గురించి చెప్పి బెట్టింగ్ చేస్తే.. అందులో వచ్చిన లాభంలో తొమ్మిది శాతం వాటా ఇస్తానని చెప్పగా వీరమణికుమార్ ఒప్పుకున్నాడు. దాంతో యాప్ లింక్, యూజర్ నేమ్, పాస్వర్డ్ ఇచ్చాడు. వీరమణికుమార్ అతని అకౌంట్ నెంబర్‌తో పాటు అతని ఫ్రెండ్ ఎకౌంట్ నెంబర్ కూడా యాప్‌లో సేవ్ చేశాడు. దాంతో బెట్టింగ్ సమయంలో వారి అకౌంట్లలో రూ.5కోట్ల వరకు వచ్చాయి. ఇందులో రూ.3కోట్లు యోగేష్ గుప్తా అకౌంట్‌కు పంపాడు. మిగతా రూ.2కోట్లలో రూ.కోటి ఆట ఆడిన వారికి ఇవ్వగా వీరమణి కుమార్ వద్ద కోటి రూపాయలు ఉన్నాయి. దాంతో కాకినాడలో ఒక్క ప్లాట్, రెండు వైన్‌షాప్‌లు తీసుకున్నాడు. కాగా, ఇప్పుడు హనుమకొండకు రాగా పక్కా సమాచారంతో అతన్ని పట్టుకొని రూ.1,50,000 నగదు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కితిరి రంజిత్, యోగేష్ గుప్తా అలియాస్ జోగేష్ గుప్తా పరారీలో ఉన్నట్టు ఎసిపి తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడి యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. నిందితుడిని పట్టుకున్న అధికారులను, పోలీస్ సిబ్బందిని ఎసిపి అభినందించారు.

'కాళేశ్వరం'పై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్నచూపు

- రైతులే సొంత డబ్బులతో కాలువలు తవ్వుకుంటున్నారు
- కక్షపూరితంగానే నిధులు ఇవ్వట్లేదు : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్నచూపని, అందుకే ప్రాజెక్ట్‌లో నీళ్లు ఉన్నప్పటికీ.. భూ సేకరణ చేయకుండా కాలువలు తొవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో ఈ ప్రాజెక్ట్ కింద ఒక్క ఎకరా కూడా భూసేకరణ చేయలేదని అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారం గ్రామం వద్ద బిక్కబండకు వెళ్లే కాలువకు ఆదివారం ఆయన నీటిని విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వం భూ సేకరణ చేయకపోవడం వల్ల చాలా చోట్ల రైతులు సొంత డబ్బులు పెట్టుకొని స్వచ్ఛందంగా కాలువలు తవ్వుకుని నీటిని తీసుకుంటున్నారన్నారు. నేడు కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు రంగనాయకసాగర్‌లో, కొండ పోచమ్మ, మిడ్‌మానేరులో నీళ్లు ఉన్నాయన్నారు. అయినప్పటికీ కక్షపూరితంగానే ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, కొత్తగా ఒక్క ఎకరం భూ సేకరణ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రాజెక్టులు కట్టి, సిస్టమ్ అంతా రెడీ చేశారని.. పంపు హౌజ్‌లు, రిజర్వాయర్లు, సబ్ స్టేషన్లు, మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ అన్ని రెడీగా ఉన్నాయన్నారు. కొండెంగులకుంట, బిక్కబండ రైతులు అందరూ వస్తే.. స్వంత డబ్బులతోనే మిషన్లు పెట్టి కాలువలు తవ్వుకున్నారని తెలిపారు. శనివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడానని, పిల్ల కాలువలు తవ్వితే రైతులకు ఆయకట్టు పెరుగుతుందనీ, కనీసం రూ.15 నుంచి 20 కోట్లు భూసేకరణకు విడుదల చేయాలని కోరినట్టు చెప్పారు. కోకాకోలా ఫ్యాక్టరీ కాళేశ్వరం నీళ్లు ఉండబట్టే వచ్చిందని.. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కుంగిన ఒకటో రెండో పిల్లర్లను మరమ్మతులు చేసి నీళ్ళు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా గోబెల్స్ ప్రచారం ఆపి, భూ సేకరణ చేసి, కాలువలు తవ్వి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న హరీశ్‌రావు

కార్మికోద్యమానికి బిటిఆర్ రచనలు స్ఫూర్తిదాయకం

- రణదివే వర్థంతిలో పి రాజారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికోద్యమానికి, కార్మిక సంఘాల నాయకత్వానికి బిటి రణదివే బోధనలు, రచనలు స్ఫూర్తిదాయకమని సిఐటియు సీనియర్ నాయకులు పి రాజారావు చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో బిటి రణదివే వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రణదివే చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులుగా సుదర్ఘీకాలం కార్మికోద్యమానికి నాయకత్వం వహించారన్నారని, కమ్యూనిస్టు ఉద్యమంలోకి 1928లో వచ్చి 1990 వరకు కొనసాగారని గుర్తుచేశారు. కార్మికోద్యమంలో కుల, మత, ప్రాంతీయ ఉద్యమాల ప్రభావం గురించి ఆయన విశ్లేషించారని తెలిపారు. శ్రామిక మహిళలను ఆర్గనైజ్ చేయాల్సిన ప్రాధ్యానతను నొక్కి చెప్పారని గుర్తుచేశారు. ప్రపంచ కార్మికోద్యమంలో రెండో ఇంటర్నేషన్‌లో కూడా భాగస్వామిగా ఉన్నారని చెప్పారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ బిటిఆర్ స్ఫూర్తితో నేడు కార్మికవర్గ ఐక్యత కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న సామాజిక న్యాయ వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వివిఎస్ రావు, ఎస్‌వి రమ, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వై సోమన్న, పి సుధాకర్, ఎ సునీత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులకు భూసేకరణ చేయాలి

- సిఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్న, నిర్మిస్తున్న వివిధ జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి నిర్మాణానికి సహకరించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి కోరారు. ఆదివారం ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. 66 ఏళ్ల కాలంలో తెలంగాణలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే.. మోడీ ప్రధాని అయ్యాక 11 ఏళ్లలో 2500 కిలోమీటర్ల నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. జాతీయ రహదారులు ఆయా ప్రాంతాలలో సామాజిక, ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తొలగిపోయి ప్రమాదాలు కూడా చాలా వరకు తగ్గాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో సేకరించి ఇస్తే ఆయా రహదారి ప్రాజెక్టులు నిర్దేశించిన సమయంలో పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి వీలుగా ఉంటుందనీ, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర 5వ మహాసభను 2025 ఏప్రిల్ 25,26,27 తేదీల్లో ఖమ్మం నగరంలో జరుగుతాయని, వాటిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి తెలిపారు. ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను జిల్లా నాయకత్వంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 10 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్ఎఫ్ఐ ఉన్నదని, నిత్యం విద్యారంగ సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. విద్యారంగంలో కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ, కేంద్రీకరణ, వ్యాపారీకరణతో పాటు నూతన సంస్కరణల పేరుతో విద్యారంగంలో తీసుకువస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ, విద్యార్థులందరినీ ఐక్యం చేసి దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నడుపుతున్నదని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం.. పేదవిద్యార్థులకు విద్యను దూరం చేసేందుకు ఆధునాతన విద్యావిధానం పేరుతో నూతన విద్యా విధానం- 2020 తీసుకువచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ, గురుకుల వసతిగృహాలకు స్వంత భవనాలు నిర్మించాలని, పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యారంగ పరిరక్షణకు, విద్యార్థి పోరాటాలకు దిక్సూచి కానున్న ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభలను విద్యార్థులు, మేధావులు, సామాజిక వేత్తలు అందరూ కలిసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ, లావుడియ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల రాహుల్, పట్టణ అధ్యక్షులు నేహాల్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమలో బాయిలర్ పేలుడు

- పెను ప్రమాదం నుంచి తప్పించుకున్న కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలోని నందికంది గ్రామ శివారులోని బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమలో ఉదయం ఐదు నుంచి ఆరు గంటల మధ్య సమయంలో బాయిలర్ పేలింది. అయితే ఈ సంఘటన కార్మికులు షిఫ్ట్ చేంజ్ అయ్యే సమయంలో జరగడం వల్ల కార్మికులకు ఎలాంటి హాని జరగలేదని తెలిసింది. అందులో ఒక కార్మికుడు ఒకే సారి భారీ శబ్దాన్ని వినడంతో భయాందోళనకు గురవడంతో అతన్ని అప్పటికప్పుడే పరిశ్రమ యాజమాన్యం ఆస్పత్రికి తరలించారు. ఈ బాయిలర్ పేలడం వెనుక యాజమాన్య నిర్లక్ష్యం ఉందని తెలుస్తోంది. ఈ ఘటనపై అధికారులు స్పందించి వెంటనే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎర్రా శ్రీకాంత్ మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రా శ్రీకాంత్ మృతికి సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు రాష్ట్రం మధురైలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో శ్రీకాంత్ భౌతికకాయాన్ని చుక్క రాములు, పాలడుగు భాస్కర్, సిఐటియు జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారని తెలిపారు. ఎర్రా శ్రీకాంత్ ఖమ్మం పట్టణ కార్మిక ఉద్యమంతో సుదీర్ఘకాలం నుండి పని చేస్తున్నారనీ, కార్మిక సమస్యలతో పాటు కార్మికుల నివాస ప్రాంత సమస్యలపై కూడా నిరంతరం పనిచేసేవారనీ గుర్తుచేశారు. కార్మిక హక్కుల కోసం యాజమాన్యాలపై నికరంగా పోరాడటమే కాకుండా కార్మికులతో సన్నిహిత సంబంధాలు కూడా కలిగి ఉండేవారని పేర్కొన్నారు. ఎర్రా శ్రీకాంత్ అకాల మృతి ఖమ్మం జిల్లా సిఐటియు ఉద్యమానికి తీరని లోటు అని తెలిపారు. ఆయన మృతికి సిఐటియు రాష్ట్ర కమిటీ తరపున విప్లవ జోహార్లు అర్పించారు.